ప్రఫుల్ల చంద్ర




# తిరగబడిన కాలి ఫిల్టర్

**ఒక గంట ముందుగానే సినిమా బుకింగ్ తెరిచారు.**

**టిక్కెట్ తీసుకున్న రాఘవకు ఈ గంట ఎక్కడ గడపాలో అర్ధంకాలేదు. ఇల్లు దూరం. పైగా భార్య పుట్టింటికి వెళ్లింది. దగ్గరలో తెలిసిన వా రిళ్లు లేవు.**

కాలక్షేపం కోసం సెంటర్‌లో నిలబడి దిక్కులు చూడడం, హోటల్‌లో దూరి మేయడం లెక్చరర్ రాఘవ కిష్టంలేని పనులు.

థియేటర్ కెదురుగా కిళ్లీ బడ్డీ... తోరణాల్లాగ పత్రికలూ.

యథాల్లాపంగా అటు నడిచాడు రాఘవ.

కిళ్లీ బడ్డీలోని అబ్బాయిని చూస్తూనే అట్టే నిలబడిపోయాడు. ఆ అబ్బాయి కూడా రాఘవను చూసి గతుక్కుమన్నాడు గాని దృష్టి మరల్చుకొని పనిలో మునిగిపోయినట్టు నటన!

అబ్బాయి వయస్సు ఇరవై ఉండొచ్చు.

ఒక రొకరుగా బడ్డీ వద్దకు జనం వస్తూనే ఉన్నారు. పది చేతు లున్న వాడిలో కిళ్లీలు చుట్టడం, సిగరెట్లు, సోడాలు, డ్రింక్‌లూ ఇవ్వడం, డబ్బు తీసుకుని చిల్లర ఇవ్వడం చకచకా చేస్తున్నాడు.

ఒక క్షణం నిలబడి పత్రిక ఇమ్మన్నాడు రాఘవ.

ఆ అబ్బాయి రాఘవ వైపు చూడనైనా చూడకుండా "తీసుకోండి సార్" అన్నాడు - కిళ్లీలు చుట్టుకుంటూ. తాడుకి వేలాడుతున్న పత్రిక తీసుకొని డబ్బు లిస్తే అప్పుడూ చూడకుండానే డబ్బు లందుకున్నాడు.

థియేటర్ పోర్టికోలోకి నడిచి, పత్రిక తిరగేస్తూ ఆ అబ్బాయిని ఎక్కడ చూశానా అని ఆలోచనలో పడ్డాడు రాఘవ.

హఠాత్తుగా జ్ఞాపకం వచ్చిం దతనికి.

గత జూన్ మాసంలో ఎంసెట్ పరీక్షల్లో అతడు అభ్యర్థి, తను వాచర్! పరీక్ష బాగా రాస్తున్నట్లనిపించిన విద్యార్థుల పేర్లు, నంబర్లూ డైరీలో నోట్ చేసుకొని తర్వాత వాళ్ల కే ర్యాంక్ వచ్చిందో చూసి సంతోషించడం రాఘవ అలవాటు.

ఆ అబ్బాయికి మంచి ర్యాంక్ వచ్చినట్టే జ్ఞాపకం. అయితే ఇంజనీరింగ్ కాలేజీలో చేరకుండా కిళ్లీ బడ్డీలో ఎందుకున్నాడు? తనను చూడనట్టు ఎందుక నటిస్తున్నాడు? సినిమా చూస్తున్నప్పుడు కూ రాఘవను ఆలోచనలు మాత్రం వదలలేదు.

ఇంటి కెళ్లాక డైరీ తెరిచి చూశాడు రాఘవ.

అబ్బాయి పేరు ప్రవీణ్. 15వ ర్యాంక్!

అంత మంచి ర్యాంక్ వచ్చిన కుర్రాడు కాలేజీ చేరకుండా ఉండడు. చదువుకోడానికి సంపాదిస్తున బీదవాడు కాబోలు. శ్రమ జీవన సౌందర్యాన్ని గుర్తిం పనిచేస్తూ చదువుకుంటున్న ప్రవీణ్ మీద గౌరవ కలిగింది రాఘవకు. అయితే అతగాడు తనని చూ ముఖం చాటు చేస్తున్నా డెందుకని?

*** *** ***

ఈ మధ్యనే ఇంజనీరింగ్ కాలేజీకి బదిలీ అయ వచ్చిన స్నేహితుడు అమర్‌ని కలుసుకోడానికి వా కాలేజీకి వెళ్లాడు రాఘవ.

వాళ్లది చిననాటి స్నేహం! 'ఒరేయ్, ఒరేయ్' అని పిలుచుకునే స్నేహం. స్నేహబంధమూ ఎంత మధురమూ - అని పాడుకునే స్నేహం. ఇద్దరూ కలిశారంటే చాలు వరినరాలు మరిచిపోయి, లెక్చరర్స్ అన్నమాటే మరచిపోయే ఒకటే సొద; ఒకటే రొద.

రాఘవ అంత దూరంలో కనిపించగానే వరుగు లాంటి నడకతో ఎదురొచ్చి భుజం పట్టి కుదిపివేస్తూ "ఒరి ఒరి! నువ్వట్రా రాఘవా! ఎంతకాలం అయిందిరా మనం కలిసి!" అంటూ కాంటీన్ వైపు లాక్కుపోయాడు అమర్ - లొడలొడా వాగుతూ.

ఇద్దరు లెక్చరర్స్ కలిస్తే చాలు, కాస్త ముందు వెనకలుగా - విద్యా విధానం, క్రమశిక్షణ చర్చనీయాంశం కాకతప్పదు.

"ఇంజనీరింగ్ విద్యార్థులు బుద్ధిమంతులు అనుకుంటారు గాని వీళ్లు కూడా మీ కాలేజీ విద్యార్థుల్లానే తయారవుతున్నార్రా రాఘవా! నిన్న కాక మొన్న చేరిన కొత్త కుర్రాళ్లు కూడా హీరోల్లాగ పోజులు పెడుతున్నారు." ఆ సమయంలో క్యాంటీన్‌లో విద్యార్థు లెవరూ లేకపోవడంతో ధారాళంగా హావభావాలతో నటిస్తూ వాళ్ల హీరోచిత కార్యాల గురించి చెబుతున్నాడు అమర్.

అదంతా వినడంలేదు రాఘవ. అతని ఆలోచన ఒక్కమాట వద్ద ఆగిపోయింది.... నిన్న కాక మొన్న చేరిన కొత్త కుర్రాళ్లు....

"మీ క్లాసులో ప్రవీణ్ అన్న కుర్రా డున్నాడా?" ఆత్రంగా అడిగాడు.

"వా డో బరుద్ధాయి! రాంక్ ఎలా వచ్చిందో గాని, శుద్ధమొద్దు! క్లాస్‌కి రెగ్యులర్‌గా రాడు. ఇచ్చిన వర్క్ చెయ్యడు. పైగా కాలేజీ రౌడీ అన్న బిరుదు కోసం తంటాలు పడుతున్నట్టు ఉంటాడు."

విడుదల ముందు ఎంతో ఉత్కంఠ రేపిన చిత్రం, విడుదలయాక తుస్సు మన్నట్లు అయింది. ప్రవీణ్ గురించి ఎంతో గొప్పగా ఊహించుకున్న రాఘవ ఖంగు తినేశాడు. తన అంచనా తప్పదని రాఘవకు ఒక గొప్ప నమ్మకం. బహుశా ప్రవీణ్ పేరు గల మరొక డున్నాడేమో కాలేజీలో.

రాఘవ నోరు తెరిచి ఏదో అనేలోగా....

"వాడి సంగతలా ఉంచు. చాలా కాలానికి కలిశాం కదా, భోజనానికి ఆహ్వానించడం లాంటి మర్యాదలు తెలియవా కుంకా! కుంకుడుకాయలు కొట్టే రాయిలాగ ముఖం, నువ్వూనూ!" గోల చేసేశాడు అమర్.


శ్రీమతి పుట్టింటి నుంచి ఇంకా రాలేదు. ఇంటి భోజనం కుదరదు. సాయంకాలం సినిమా చూసి 'మానసా'లో భోజనం చేద్దామని ప్రతిపాదించాడు రాఘవ.

*** *** ***

సినిమా టిక్కెట్లులు తీసుకుని ఇద్దరూ కిళ్లీబడ్డీ వైపు నడిచారు. అమర్ సిగరెట్ కొని అంటించాడు. అది అయేవరకూ ఇద్దరూ బడ్డీ వద్దనే నిల్చున్నారు. అమర్ గలగలా జోక్స్ పేల్చుతున్నా రాఘవ దృష్టి అంతా ప్రవీణ మీదనే.

ప్రవీణ్ ముఖం అటు తిప్పుకొని వేళ్లలతో బిజీగా ఉన్నాడు.

సిగరెట్ అయాక థియేటర్ వైపు నడుస్తూ - "ఆ అబ్బాయిని చూశావా? వాడే కదూ ప్రవీణ్." అడిగాడు రాఘవ ఉండబట్టలేక.




"నీకు గాని ప్రవీణ్ పిచ్చి పట్టిందా ఏమిట్రా? కిళ్లీలు చుట్టుకునే వాడిని కాలేజీ కుర్రాడు అంటావ్; పైగా ఇంజనీరింగ్ కాలేజీ! నా చెవిలో పువ్వులు కనిపిస్తున్నాయా నీకు?" గలగలా నవ్వేశాడు అమర్.

అయితే ఆ కుర్రాడు ఇంజనీరింగ్ కాలేజీలో చదవడంలేదా? మరి అతనికే కదా రాంక్ వచ్చింది! ఎక్కడో ఏదో పొరపాటు జరిగి ఉంటుంది. ఏమై ఉంటుంది. థియేటర్‌లో కూర్చున్నా ఇవే ఆలోచనలతో సతమతమైపోతున్నాడు రాఘవ. అతని తత్వమే అంత. ప్రతి చిన్న విషయాన్నీ తీవ్రంగా ఆలోచించి బీపీ తెచ్చుకుంటాడు.

రాఘవ, అమర్ - ఇద్దరూ సినిమా కెళ్లారంటే కబుర్లే కబుర్లు. సినిమా చూడరు. అలాంటి రాఘవ ఇప్పుడు కుంకుళ్లు కొట్టే రాయిలాగ ఉలుకూ పలుకూ లేకుండా కుర్చీలో పడి ఉంటే అమర్‌కి అసహనంగా ఉంది. ఇంటర్వెల్‌లో బయటకొచ్చాక, రాఘవ చెవి మెలి పెట్టేసి "నీతో సినిమాకు రావడం కన్నా ఇంట్లో ముసుగేసుకుపడుకోవడం బెటర్ కదా" అన్నాడు.

"అది కాదురా! ఆ ప్రవీణ్.... ప్రవీణ్...."

ఠక్కున చెవి వదిలి, చటుక్కున నమస్కారం పెట్టేశాడు అమర్.

"బాబ్బాబూ! నీ కో నమస్కారం! మీ ప్రవీణ్‌కి వదిన్నర నమస్కారాలు! ఇంక సినిమా వద్దు గాని ఇంటికి పోయి ప్రవీణ్ సహస్రనామావళి పారాయణం చేద్దాం పద!"

జనం కెరటాల్లాగ తోసుకు వస్తున్నారు. కాంటీన్ వైపు కొందరు, పాకేసుల వైపు కొందరు, రోడ్లు పావనం చేయడానికి మరి కొందరూ. ఆ రద్దీ నుండి, ఆ హడావుడి నుండి కాస్త దూరంగా అమర్‌ను లాక్కుపోయాడు రాఘవ.

"చెప్పేది వినరా అమర్! ఆ. కిళ్లీ బడ్డీలో కూర్చున్నవాడే ఎంసెట్ రాంకర్ ప్రవీణ్. నాకు బాగా తెలుసు. మరి మీ కాలేజీలో ఇం కో ప్రవీణ్ ఉన్నాడా?"

ముఖంలో ఎప్పుడూ చెరగని చిరునవ్వు మాటల్లో తరగని అల్లరీ ఉండే అమర్‌ని రాఘవ స్వరం కదిలించివేసింది. "మా కాలేజీలో ఉన్న ప్రవీణ్ వీడు కాదు. వీడు పరీక్ష రాస్తే, వాడు కాలేజీలో చేరాడు. ఇలాంటివి జరుగుతున్నాయని వింటూనే ఉన్నాం" అన్నాడు గంభీరంగా.

"ఎంసెట్ ఎంతో కట్టుదిట్టంగా, పకడ్బందీగా...."

"కట్టుదిట్టంలో కూడా కనికట్టు చేయగల ప్రతిభావంతులు మనవాళ్లు! ఎంసెట్ పరీక్ష రాసేటప్పుడు హాల్ టిక్కెట్ మీద ఫొటో ఉంటుంది. కాలేజీలో చేరేటప్పుడు అప్లికేషన్ ఫాం మీద ఫొటో ఉంటుంది. ఈ రెండు ఫొటోలూ ఒకరివే అని నిర్ధారణ చేసే అధికారి కళ్లు మూసుకొని "ఎస్" అనడానికి ఒక రేటు ఉంటుంది. ఆ అధికారి ఎవరో, వారి రేటు ఎంతో తెలుసుకునే నేర్పు ఉంటే చాలు పని జరుగుతుంది." పద్ధతి వివరించాడు అమర్.

కాలేజీలో చేరిన ప్రవీణ్ - స్థానిక రాజకీయ నాయకుడి కొడుకు. ఆ నాయకుడు హోటల్ క్లీనర్‌గా జీవితం ప్రారంభించి రాజకీయాల్లో ఎదిగి, కాంట్రాక్టర్‌గా మారాడు. జిల్లాకు సంబంధించి ఉద్యోగాలు, బదిలీలు, కాంట్రాక్టులు - ఏవి కావాలన్నా మిస్టర్ క్లీనర్‌ని పట్టుకుని తగిన రేటు చెల్లిస్తే చాలు. అందరికీ పనులు చేసే అతగాడు స్వంత కొడుక్కి ఇంజనీరింగ్ సీటు సంపాదించలేడా?!

ఆంగ్లేయులు మన కన్యాయం చేస్తున్నారనీ, పీల్చి పిప్పి చేస్తున్నారనీ, వాళ్లని తగిలేసి మనదైన ప్రభుత్వాన్ని స్థాపించుకున్నాం. అందరికీ న్యాయం, ప్రతిభకు పరిగణన లభిస్తాయని ఆశించాం. అలా రాజ్యాంగాన్ని రాసుకున్నాం. ఎన్నోసార్లు సవరించుకున్నాం. నియమ నిబంధనలు పెట్టుకున్నాం.


కానీ, జరుగుతున్న దేమిటి?!

బీద వాడికి సాయపడాలని బ్యాంకుల్ని జాతీయం చేస్తే హర్షద్ మెహతాలు తన్నుకుపోతున్నారు. చక్కగా పాలించమని గద్దె నెక్కిస్తే గుడుల కోసం, గోపురాల కోసం ప్రజల్ని చంపుతున్నారు. అవినీతిని అంతం చేస్తారని ఎదురుచూస్తే బోఫోర్స్‌లు సిద్ధం! ప్రతిభకు పట్టం కట్టాలని ఎంసెట్లూ, ఆ సెట్లూ, ఈ సెట్లూ ప్రారంభిస్తే ఇలా ప్రవీణ్‌లు పుట్టుకొస్తున్నారు. ఎన్నో త్యాగాలు చేసి సంపాదించిన ప్రజాస్వామ్యం నోటుకేసులకు బలి అయిపోతోంది.

నిష్కృతి లేదా? పతనాన్ని నివారించలేమా?

*** *** ***

"మిస్టర్ ప్రవీణ్!"




చిన్న పూరిల్లు. ఒక్కటే గది. తడకల పార్టిషన్‌తో రెండు చేశారు. ఒక మూల టేబుల్ మీద కిళ్లీ సామాను, సిగరెట్ పెట్టెలూ, సీసాలూ, మాగజీన్స్ చిందరవందరగా. ఆ రోజుకి కావలసిన సామాను పెద్ద సంచిలో సర్దుకొని బడ్డీ తెరవడాన్కి వెళ్లబోతున్న కుర్రాడు పిలుపు విని ఉలిక్కిపడి బయటకొచ్చి చూశాడు.

ఎదురుగా లెక్చరర్ రాఘవ!

కుర్రాడి ముఖం పాలిపోయింది. భయం దోబూచులాడింది. ఒక్క క్షణమే. అంతే. ఇంక భయపడి లాభం లే దనుకున్నాడు కాబోలు.

"లోనికి రండి మాస్టారూ!" ఆహ్వానించాడు.

"నిన్ను నూరిబాబు అని పిలవాలా? ప్రవీణ్ అని పిలవాలా?" గంభీరంగా అడిగాడు రాఘవ లోనికి వెళ్లి, ఆ గదిని ఓ కంట పరిశీలిస్తూ.

"ఎలా పిలిచినా సరే." నవ్వేశాడు కుర్రాడు బొక్కి రేకు కుర్చీ టేబుల్ వద్ద వేస్తూ.

ఆ నవ్వులో ఏదో పసితనం, అమాయకత్వం, ఏదో ఆకర్షణ ఉన్నాయి; తెగింపూ, నిస్సహాయతా ఉన్నాయి. కర్కశంగా మాట్లాడా లనుకున్న రాఘవ మెత్తబడిపోయి కుర్చీలో కూలబడ్డాడు.

టేబుల్ మీద చిందరవందరగా పడి ఉన్న వస్తువుల్ని సర్దుతూ రాఘవ అడగబోయే ప్రశ్నకు సమాధానంలాగ అన్నాడు నూరిబాబు - "బిస్కట్‌లూ, బీడీలూ అమ్ముకున్నట్లు తెలివితేటల్ని కూడా అమ్ముకోవడం తప్పా మాస్టారూ? నిజం చెప్పాలంటే లెక్చరర్‌లూ, ఉపాధ్యాయులూ, ఉద్యోగులూ అందరూ తెలివితేటల్ని అమ్ముకుంటున్నవారే! నెల జీతానికి ఉద్యోగం చేయడం వాయిదాల పద్ధతిలో తెలివితేటల్ని అమ్ముకోవడం కాదా?"

రాఘవకి చురుక్కు మంది. "తెలివి తేటల్ని అమ్ముకోవడం తప్పుకాదు. విద్య - వ్యాపారం అయిపోయిన మాటా నిజమే కాని ఒకరు ఇంకొకరి పేరుతో పరీక్ష రాయడం మాత్రం నేరం! శిక్షార్హమైన నేరం! ని న్నిప్పుడు పోలీసులకు పట్టించడానికే వచ్చాను" అన్నాడు.

ఆ స్వరంలోని కటుత్వానికి ఓ క్షణం నివ్వెరపోయినా అంతలోనే సర్దుకొని నిటారుగా నిల్చుని, రాఘవని తేరిపార చూశాడు నూరి.

ఏదో నిర్ణయానికి వచ్చిన వాడిలా కృతనిశ్చయం కదలాడుతున్న స్వరంతో నిశ్చలంగా అన్నాడు - "నిజమే సార్! నన్ను అరెస్టు చేయవలసిందే! నేను బోఫోర్స్ భోక్తను కాను! హర్షద్ మెహతానూ కాను! సూట్‌కేసు అందుకున్న రాజకీయ నాయకుణ్ణీ కాను! స్వంత పిల్లల కోసం పేపర్ లీక్ చేసే ఆఫీసర్‌నీ కాను. గుమ్మడి కాయంత నేరగాళ్లని ఒదిలేసినా, నాలాంటి ఆవగింజల్ని పట్టుకుంటే మీ సంస్కారానికి సార్థకత! పేపర్‌లో ఫోటో పడుతుంది! ఎంత ప్రచారం! పదండి సార్, పోలీస్ స్టేషన్‌కు పోదాం" అంటూ ఆవేశంగా గుమ్మం వైపు నడిచాడు.

ఆ ఎదురు దాడికి రాఘవ ఘ్రాన్పడిపోయాడు. నూరిబాబుని అరెస్ట్ చేయించాలన్నది అతని ఉద్దేశం కానేకాదు. తమాషా చేసి ఆట పట్టించా లనుకున్నాడు. నూరిబాబు భోరున విలపించి క్షమాపణ కోరుకుంటా డనుకున్నాడు గాని ఎదురుదాడి ప్రారంభం అవుతుం దనుకోలేదు.

రాఘవ కదలకపోవడం చూసి నూరి మళ్లీ వెనక్కి వచ్చాడు. "త్వరగా వెళదాం పదండి సార్! మిస్టర్ క్లీనర్ గారింట్లో అంట్లు తోమడానికి వెళ్లిన మా అమ్మ తిరిగొచ్చేలోగా వెళ్లిపోదాం పదండి! నేను నేరగాడినని తెలిస్తే అమ్మ భోరున విలపిస్తుంది. ఆమె కన్నీరు నేను చూడలేను. తొరగా పోదాం పదండి" అని తొందరపెట్టాడు నూరిబాబు.

రాఘవ , ఇం కే మాత్రం కాఠిన్యం నటించలేకపోయాడు.

"ఎందు కిలా చేశావ్ నూరీ?" అన్నాడు గద్గదంగా.

"డబ్బు కోసం! అక్క పెళ్లి కుదిరి, ఇంక నెల రోజుల్లో పెళ్లి అనగా నాన్న చనిపోయారు. నాకా, ఉద్యోగం లేదు. పైసా రాబడి లేదు. అమ్మ నాలుగిళ్లలో పాచి పనికి కుదిరింది. ఒక పూట తిని, ఒక పూట తినక - ఏదో జీవితం గడిచిపోతోంది గాని అక్క పెళ్లి ఎలా? ఆ పరిస్థితిలో మిస్టర్ క్లీనర్ దేవుడిలా ఆదుకున్నాడు. వాళ్లబ్బాయి ప్రవీణ్ ఇంజనీర్ అయితే మూడు లక్షలు కట్నం; పైగా ప్రభుత్వ కాంట్రాక్ట్‌లొస్తాయని ఆయన ఆశ. ప్రవీణ్ కాపీలు కొడుతూ పాసైన బాపతు. ఎంసెట్‌లో కాపీ కుదరదు. ఇతర రాష్ట్రాలకు పంపితే ఖర్చు. ఇక్కడి కాలేజీ అయితే - విద్యార్థి నాయకుడిగా, తర్వాత రాజకీయంగా ఎదగవచ్చు. లాభ నష్టాలు బేరీజు వేసి, ప్రవీణ్ బదులు నేను ఎంసెట్ రాసి, ర్యాంక్ సంపాదిస్తే పాతిక వేలు ఇస్తా నన్నాడు - దేవుడే పిలిచి వరం ఇచ్చినట్టు భావించాను. ర్యాంక్ వచ్చింది. అక్క పెళ్లి అయింది. మిగిలిన డబ్బుతో బడ్డీ పెట్టుకున్నా. జీవితం దొర్లిపోతోంది." దీర్ఘంగా నిట్టూర్చాడు నూరిబాబు.

క్షణం మౌనం తర్వాత కూజాలోని మంచినీళ్లు తెచ్చి టేబుల్ మీద ఉంచాడు. అప్పుడే సన్నని గాలి కెరటం లోనికి దూసుకొచ్చింది. శరీరానికి మెత్తగా, హాయిగా తాకింది. కానీ దానితోబాటు పక్క కాలువలోని దుర్గంధం గుప్పు మంది. ముక్కు మూసుకున్నాడు రాఘవ.

చిన్నగా నవ్వుకొని అన్నాడు నూరి - "మన కెంత ఇష్టం లేకపోయినా కంపు గాలి పీల్చక తప్పడం లేదు. అలాగే అవినీతి కూడా."

"అవినీతి కాఫీ లాంటిది. సంఘం కాఫీ ఫిల్టర్ లాంటిది. తాగుతున్న కొద్దీ ఇంకా తాగాలనిపించి ఆరోగ్యం పాడుచేస్తుంది కాఫీ. ఫిల్టర్‌లో పై గిన్నెలో కాఫీ పొడి, వేడినీళ్లూ వేస్తే క్రమంగా డికాక్షన్ కింది గిన్నెలోకి చేరుతుంది. అలాగే అవినీతి కూడా పై నుంచి కిందకు వ్యాపిస్తుంది. పైన కడగకుండా కింద కడగడం వల్ల ప్రయోజనం ఉండదు."

ఎంత తెలివిగా చెప్పాడు నూరిబాబు! కోచింగ్ లేకుండా స్వయంకృషితో ఎంసెట్ ర్యాంక్ సంపాదించడం సామాన్యం కాదు. దైవదత్తం అయిన తెలివి అది. ఆ కుర్రాడి తెలివితేటలు కిళ్లీలు చుట్టుకోవడంతో తెల్లారిపోకూడదు.

"నువ్వు చెప్పేది నిజమే నూరి! ఇంటి నిండా దోమ లున్నాయి. ఇంటి చుట్టూ కుళ్లు కాలువ ఉందని చూస్తూ ఉపేక్షించకూడదు కదా! కాలువలో మందు చల్లి దోమ తెర వేసుకుంటాం. అలాగే అవినీతిని చేతనైనంత ఎదుర్కోవడం పౌరుల కనీస ధర్మం. నిన్ను శిక్షించడానికి రాలేదు నేను. మళ్లీ మళ్లీ అలాంటి పని చేయకుండా రక్షించడాని కొచ్చాను. నాకు తెలిసిన కోచింగ్ సెంటర్‌లో పని ఇప్పిస్తా. ఎంసెట్ కుర్రాళ్లకి కోచింగ్ ఇస్తావా?" అడిగాడు రాఘవ.

అ దో జోక్ అనుకొని నవ్వేశాడు నూరిబాబు.

"డిగ్రీలు సంపాదించిన లెక్చరర్లు అయితే తమ ధోరణిలో చెప్పుకుపోతారు. విద్యార్థికి ఎలాంటి సందేహా లొస్తాయి? అర్థం అయిందా లేదా అని పట్టించుకోరు. విద్యార్థుల ఆలోచనా ధోరణి ఎలా ఉంటుందో నీకు తెలిసినట్టు లెక్చరర్స్‌కి తెలియదు. కోచింగ్ ఇవ్వడంలో నీవు రాణిస్తావని నా నమ్మకం."

రాఘవ వేళాకోళం చేయడం లేదని గ్రహించిన నూరి ముఖంలో ఆనందం, ఉద్వేగం ఉవ్వెత్తుగా పొంగి అంతలోనే చల్లారిపోయింది. "పరీక్ష అయితే రాయగలను గానీ... బోధించడం..."

"ఎలా బోధించాలో నేను శిక్షణ ఇస్తాను" అన్నాడు రాఘవ.

చటుక్కున వంగి రాఘవ పాదాలు స్పృశించాడు నూరి. అతడ్ని లేవదీసి హృదయానికి హత్తుకున్న రాఘవ కళ్లలో ఒక్కసారిగా కన్నీళ్లుబికాయి.

**అవినీతిని వేలెత్తి చూపడం తేలికే. అందరూ చేసేదే.**

అయితే అందుకు కారణాన్ని అన్వేషించి సంస్కరించే ప్రయత్నం - అది ఎంత చిన్నదైనా - గొప్పదే!